# స్వరమేళ

‘పవలెల్ల వేగిపోయిన చండకిరణములను నీడకు దార్చి ఆరబట్టి ఉడుకు వో వడబోసి, నలుమొగాల వెన్నెలగా చిలుకరించిన మలయానిలము! చివురులు చాటౌ సిగ్గరి మరుమల్లె లేలేత పరువంపు కలకల: అలలు అలలుగా వగవగల వలపులు తమకాన పై కొనంగా సరసాలకు ఝుంకరించు షట్పదాల ఘుమ్ముమ్మన కసరే సంపంగి. కప్పురమ్ముమ్మ చల్లిన తీరుగా, నెమ్మెమ్మన కలప మలందిన కన్నె కోమలి తీవిగా, నులివెచ్చని రాచబాట; అడుగు ముందుకు పడని ఆపసోపాలాయె. అదనైన హాయిగా పవళించ మనసాయె; అయ్యారే!– బడలిక లేదు కాని, బద్ధకము హంస రెక్కల వీవన పట్టినది. విరియబూసిన కనక మంజరి, ఆదరించి ఆకు మడుపు లందించు నవకాల జవరాలై మనసార మెల మెల్లన మౌనముగా మందెమేలమాడుతూన్నది: ‘మన కీ రేయిని నిలువ నీడ ఏకడ?–’ అనుకొనినాడు: శ్రీనాథుడు: అది, – కన్నడ సీమ: దొడ్డరాయల ఏల్బడి: రాయలు, – మాంచి రసికుడట!– రసికుడనంగా, – వసంత మంటపములో, కృష్ణాసావినహారహా ముపాసించు యోగ్యుడట!– కృష్ణాసాని – అనంగా, – బసవన గుడిపడుచు: పుట్టినది బ్రాహ్మణ పుట్టువేనట; తరతరాలుగా, – ఉన్న లేమి, తమకీ తరణోపాయము చూపించినదని, – కన్నవారు, – బాల పుట్టుకతో సంబరపడి, – అబ్బురాన మూడేళ్ళు పెంచి, – బాలను, – బసవన్నకు గుడి పడతిగా యిచ్చుకున్నారట: సన్నిధిలో గుడి సేవకి, – కంజలోచన, – బాలకు, అనువైన విద్దె లిచ్చి, – నటన నేర్పి, – ఆ బంగరు తీవెకు మెరుగులు దిద్దినదట; ఆటపాటల మేటి వలంతిని జేసినదట: పూచిన పూవు పరిమళించినది; రాయల కీ ఘుమ ఘుమ సోకినది: వారూర కుంటారా?– ప్రజలకు వారు ప్రత్యక్ష దైవము కాదా? – రాయబార మంపినారు: సముఖానికి రప్పించుకున్నారు: వసంత మంటపం ఆ ప్రోడ కుంకువ జేసినారు: ఆ దాసికి తాము దాసులైనారు: దాసుని జేసి కొన్నదిగా! ఆ పెగ్గడి కత్తె కా నెరజాణతన మెక్కడిది? – పుట్టుకతో వచ్చినదా? లేదు: కంజలోచన చెప్పచేతలో నేర్చినదా – లేదు! – రాయలు తొలిసారి తన్ను చూడంగనే, – వాని కన్ను విప్పారినది: పెదవి కంపించినది: మాట తడబడినది: సాచిన కరములు వణకినవి: – అ౦–పని లోగొనుటదెంత: – అనుకున్నది: సాకూతముగ జూచినది కాని, – సరసకు జేరలేదు, – పదము లంటలేదు, – బరాబరులు సేయలేదు: కన్నార గారవించలేదు: కప్పురవిడె మీయలేదు: నీదాన ననలేదు – నీకే దక్కితి ననలేదు: కౌగిట జిక్కలేదు: తానై కౌగలించలేదు: ఎదుట నిలచి – కనుసైగ జేసినది: రాయలు లేడివలె చోరబోయినాడు: తాను, నిదానముగ వయారముగా కూర్చున్నది: ‘రాయలవారూ!’ అన్నది: ‘వీరు, – దేవరాయలు!– మా చేవేరి కృష్ణాంబిక, ఏకాంతాన మమ్ము దేవా! అని పిలిచేందుకు సమ్మతించినాము; నీకూ ఆ స్వాతంత్ర్య మిచ్చేము–’ అన్నాడు రాయలు.

అక్కరలేదు: ఆ స్వాతంత్ర్యము, - మన చెలిమి కొనసాగేందు కవసరము: మేము దైవన్నే దేవా! అనము. పదము పాడి భజించే వేళ, వాడు సరసుడు, - మాకై మరులైన తేరకాడు: ఏరా, - యిది నీకు మేరకాదురా! సరసమునేరని దొరతన మేలర - చెలులు నవ్వేరురా! సమ్మదాన దరియరా: అద నిదని మదవతిని బిగికౌగిట నదుమరా - రారా!- చేకోరా- అని 'రా' కొట్టడం పరిపాటి! దేవునే 'రా' అనే వారికి-, రాయలు దేవుడయ్యేనా!- ఆసపడినవారు, మా కను సన్నల మెలక నేర్పవలె: సరియేనా! - సామంతులు బలసి కొలచే సభాభవనాన, - మీ తీరులు మీవి: మేము సామంతులము కాము: సరసాల వారము?

మీ రాజసాలు మాకడ చెల్లవు!-

మీరు మావశంవదులు!

ఎంతకాల మనేరా ?-

యీ సరసము సాగినంత కాలము!-

అప్తై -?

మీ కొలువు కూటమూ మీ అంతఃపురమూ మీకుండనే ఉన్నవి:

ఔను!- ఉలుకెందుకు? - అగ్నిసాక్షిగా చేపట్టిన వారినే, - అక్కరకు రానివారినిగా చేసి యీ చిరునేతల కాసపడినారే! - యీ అనుబంధము శాశ్వతమౌనా? - మీకు ముదము తీరినా, ముదిమిసోకినా, - దువ్వుకునేందుకు మీసమున్నది: చేయి చేడియపై, మోపలేని తనమున యిక, - నాతో పనేమి?- నాకు?- ఏ కళనైన యిక్కడ కాలు నిలువదోఁ, - అంతటితో యీ సరసానికి స్వస్తి -

మీ ఆశ్రయము, మీ కటాక్షము కరవైన నేనేమై పోయేనో అని దిగులా? - దివ్యముగా ఉండేము, - మాకేమి? - మదనుని అమ్ముల చేవ తరుగనంతకాలము: మా నేవళము తరుగదు: పండు ముదుసలి తనమ్ము పైకొన్నా, - అంగరాగమ్ముతో పరువమ్మలందు కొని, - ఎదుటివానికి కనువేదురు కల్పించి మేలిముసుగు చాటున బాలాకుమారినై, - బింకాన వలపించగలను: ఏనాటికైన సరసులు రోసే రనేరా? - అప్పటికి ఉండనే ఉన్నాడు ఆలయములో వెలసినవాడు: దానికి వయసుతో వలపుతో నిమిత్తములేదు: గిలిగింతలు సేయరాదు, - కెమ్మోవి నొక్కరాదు: అక్కున జేర్చడు: అసురుసు రనడు: కనుల ఎదుటనున్న చాలును! కామితము లిచ్చేను! - మా కేమి కొదువ!-

రాయలవారూ! - సరసాల వేళనైన నేను, మీదానను కాను; మీరూ నావారు - కారు; కల్లలాడి మెరమెచ్చులిచ్చే, - ఆ కాపురము మనదికాదు: గాలివాటున కదలి, మొయిలు మొయిలును దరిసి, - తమ దారి తమదైన తీరుగా, - మన ముందాము! సరి అన్న సరి! -

రాయలవారూ? - మీరు, - రాయవేశ్యాభుజంగులట కదూ! మిండతనము, - మీ రాజసానికి బిరుదము: ప్రజలకు తమ యీ వినూత్న సరసము చెవి సోకంగనే, - అయ్యారే, - నవరస రసికుడు గదా మహారాజు: వారై, ముక్కువ గొన్న మాణిక్యమెట్టిదో, - అని వయసువారు ఉవ్విళ్ళూరరా? - అలదాని కనులేపాటి పలువరుస ఏ తీరు, - చిరునవ్వున ఏ తీవి? - పొంకమెంత. బింక మెంత, - దాని హొయలెట్టివి. సరసాల వేళదాని జాణతనమెంత, - అని మనసున

నిలువుదోపిడి సేయరా, – చెంగున రతనాలు కట్టాక చేతికి పైడిరూక లివ్వక, – తలచినవేళ, – కలలోకి రప్పించుకొని, – ఊహల ఉయ్యాల నుంచి, – నన్ను గాఢముగ కసిమసంగరా? – రాయల ఉల్లాసకత్తె – ఊరి వారికి ఉంపుడుకత్తె – యిందుకు మీరూ నేనూ, – కాదనలేము, – ఎవ్వరినీ వారించలేము: తలచరాదని కట్టడి సేయలేము: అనుభవించవలసినదే: లోకములో కొందరు మూఢులు అనగా, అమాయకులైన ప్రభువులు, – తమ ప్రేయసి కామకళా ప్రావీణ్యమును ప్రజలు వివరముగా ప్రస్తుతించగా, – తామింతటి ఘనులమా అని, – భుజము లుప్పొంగ పొంగిపోయేరట! తామూ!– ఏనాటికైన, – అంతటివా రయే రేమో – అయినా మన కా చింత లేదు:–

ఏతావతా, – నేను కోరునది ఒక్కటే – మీ ప్రజలకు నేను కనుచాటు కాను; వసంత మంటపమే నా విడిది: అచ్చట రాధామాధవులు వెలసేరు: అనుదినమూ సంజెవేళ, ఆడి పాడి, – ఆరాధించేను: ప్రజలందరూ, – దయచేయవచ్చు! – ప్రసాదము స్వీకరించవచ్చు, – తనివితీర నన్ను చూడవచ్చు!–

యిందుకు సమ్మతమేనా, –

కాదనేరా. – నేనిక్కడ నిలువను గద!– ఏ సీమలోనో, – నా నాట్యాన నేనుండెను: అప్పుడో, –

అలనాడు, – మైసూరి దొడ్డదేవరాయల మమతనే లెక్కసేయక, – వాని వైభవము కాలదన్ని కదలివచ్చిన కల్యాణి యిదిరా, అన్న గణన కెక్కనా? – ఆనాడు మీ దర్పమే మౌను? –

రాయలవారు, ఏమనేరు? – ఏమయేరు? కృష్ణాసానికి – అక్రీతదాసులైనారు:– యీకథ – శ్రీనాధు డేనాడో విన్నాడు: కృష్ణాసానిని, – చూడ వేడుకపడినాడు: కాని, – రాక కిదొక్కటే కారణముకాదు:

రాయల నాశ్రయించుకున్న, – రాజనాథుడు – కవనమల్ల నేర్చినవాడు; పండితుడు: రాయలం వినోదమునకు, – యోగానంద ప్రహసనమని, – గ్రంథము చేసినాడు: దానిని పరువున్నవారు చేపట్టరాదు: అంత పనికిమాలిన దది: ఆ ఘనకార్యానికి బిడియపడక, – రాయలచేత కవిసార్వభౌముడ వనిపించుకొని, – ఆ బిరుదము కంచుఢక్క మ్రోగించి చాటుకొన్నాడట! – ఆ ఢక్కా పగులవేయవలె – అదొకపని,

రాయల కుమార్తె, – చిక్కవిరుపాజి, – అతిగ–చక్కనిదట: నేరని విద్యలేదట – ముమ్మయ్యగారు, – ఆ కోమలికి గురువులట – వారనగా, – వినయశీలురు: కాని, – యీ వయారికి, – ఆ ఒక్క వినయములో గురు కృప కొరవడినదట: తండ్రి కన్న తనయకు దర్ప మెక్కుడట! రాజకుమారులు, – మనసై మనువు కాసించి వచ్చి భంగపడినారట – ఒకటి రెండుసారులు యీ తీరైనా, – ముమ్మయ్యగారు మందలించలేదట – తమకు తెలియనట్లే వర్తించి నారట: కాని, – ఏ ఏటి కాయేడు, యిదే వయస కాగా, – మరి, – అప్పటికి వారేమనుకొనినారో, – యిహ కోటలో అడుగుపెట్టలేదట; వసంత మంటపానికి సమీపాన ఉన్న కదళీవనంలో, – ద్రాక్షపందిరి నీడలో ఉంటారట: రాయలవారు బింకముడిగి వచ్చి బ్రతిమాలినారట: 'రాయలవారూ – కోటలోఉన్నా – తోటలోఉన్నా, – ఎన్నటికీ

నేను మీవాడనే: అరటిచెట్టు గాలి, – యీ వయసులో అనుక్షణమూ వంటికి సోకుతూండటం – ఆరోగ్యమునకు చాలా ఉత్తమం: మునుపటివలె యిప్పుడు, – కోటలో పరిమళధూపమూ, – ఆ దీపకాంతులూ, – సరిపడుటలేదు: ఆరబయలున, – అంతో యింతో వెన్నెలలో, – యిలా కాలక్షేపం చేయనీయండి, – అన్నాడట: వారిక బలవంతము చేయలేదట!'

కొన్ని ప్రొద్దుల కొకనాడు, – కృష్ణాసాని, కదళీవనానికి వచ్చి, – ఎలా మనవిచేసి కున్నదంటే –

అయ్యా! 'తాము దరిసెన మిచ్చి, మూడు పున్నములైనవి: – సంజెవేళ, స్వామిసేవ వేళ, – తాము దయచేయడం, – నేను తమ సన్నిధిలో, – ఏదో ఆలాపన చేయడం, – అదృష్టమని భావించినానే: మా వలని అపరాధమేమి! – ఏలినవారిపై తమ కరుణ తప్పనది: కోటలో ఉనికి మానినారు: రాయలవారు, వసంతమంటపంలో కనిపించేరని, – ఆచాయలకే, రా మానినారు. ఔనా? – వారికి యీ వైనం విశదీకరించినాను: వారూ చిన్న బుచ్చుకున్నారనుకొనండి! – అయినా, – నామాట మన్నించినారు: సంజెవేళ, వారక్కడికి రారు – యికనైనా, తాము దయచేయరాదా? – నేరని అపరాధమేదైన కలిగిన మన్నించండి, – సరిదిద్దండి!–' అన్నదట. అంతా ఆలించి ముమ్మయ్యగారు, నిదానంగా నవ్వి – 'సీమ వారిది – సింగారి వారిది!–

యీ కట్టడి వారి కెందుకు? –

మీ ఆటపాటలు ఎప్పటి వలెనే సాగనీయండి:

నేను యిక్కడనుండే ఆ దైవానికి మ్రొక్కేను' అన్నవారు కాగా, – కృష్ణాసాని మారుపలుక లేక తిరిగిపోయినదట –

మరికొన్ని ప్రొద్దులకు, – చిక్క విరుపాజి ముమ్మయ్యగారి దర్శనానికి వచ్చిందట! – చూసీ చూడగనే, –

'మా తల్లీ – రా అమ్మా' అన్నారట:

'మనం శాకుంతలం పఠించిన తరుణాన–, కణ్వుడన్న వాక్యములు మననము జేసినాము కదూ: నీవు శకుంతల వౌదువేమో, – నేననేది – శాపగ్రస్త కాని శకుంతల! – నేను కణ్వుడనుకానుగా! – అయినా, – నాకళ్ళ ఎదుట పెరిగిన బాల, – తన కాపురము తాను చేసుకుని, – తనివిగా భోగమనుభవించి, – కుమారునికి రాజ్యమప్పగించి, కోడలికి రాణివాసమప్పగించి, – శాంతంగా కాలక్షేపం చేసేందుకు, తిరిగి వచ్చేవనీ, – శతవృద్ధునై, – నేనెదురు చూచేననీ... అది నా ఆలాపన తల్లీ! యీ కదళీవనం – నాకోసరముకాదు – నీది:

'యిన్నాళ్ళూ, – యీ వృద్ధునికి తన మీద కోపమని, మా రాకుమారి, యీ ముమ్మయ్య దర్శనానికి రాలేదు. వచ్చి కంటచూడలేదు, – అది నీ లోపము కాదమ్మా – మీది రాచ పుట్టువు. ఎదుటి వారిని అనగలరు కాని, – మాటపడరు! – పెళ్ళిపేరంటములమీద భ్రాంతి ఉన్న ఎవడో చిన్నవాడు, మన సీమకు రావడం – వచ్చిన త్రోవనే తలవంచుకుని పోవడం... యిలా కొంతకాలము నిత్యోత్సవంగా జరిగింది: చూసేవారికి చూడవేడుకే! వినేవారికి వినవేడుకే, –

'దానికేమి – ఎవ్వరెవ్వరు భాగ్యము లెట్టివో!

'చూశావు తల్లీ! – 'వరుని గుణగణాలెన్నేది – కన్య తలిదండ్రులు: భాగ్యభోగ్యము లెన్నేది బంధుకోటి, – అర్షేయ పౌరుషేయము లెన్నేది, – కులగురువులు: కన్య గణుతించేది రూపమొక్కటే;–' అని. పెద్దలనగా విన్నాముకదూ – కాని వారు, – ఛాందసులు, – లోకజ్ఞానము తగినంత కలవారు కారు: అగత మెరుగని వారు: అనుభవ శూన్యులు: కాన, వారి ప్రసక్తి, – మన విషయములో అసంగతం: ఎవరికి వారే పెద్దలు! – అంతే!

అందాకా ఎందుకమ్మా – ఎల్లకాలం, నన్ను పోషించే మహారాజు! – వారి మాటే నేను కాదన్నానే: నేనే – కాదన్నానే! మహారాజ కుమారివి – ఏనాటికో కాబోయే మహారాణివి: నీకు ఒకరి ఆదరణ, అనురాగముతో నిమిత్త మేమి? కాని, వెన్నెలకు రోదసి ఆశ్రయం, – వల్లరికి వృక్ష మాశ్రయం, – విరిబోణికి ధవుడాశ్రయం: రంభ ఊర్వశులైన తమ అందము తామై అనుభవించ తరమౌనా!–

అమ్మా! నీవు, తెలిసినదానవు:

ఎదుటి వారెన్నటికీ, తెలిసీ తెలియనివారే, –

అది, సాజము!–

నీ మనసు నీవైన తెలుసుకొనవమ్మా –

అదేమాకు పరమానందము!–

– యిది, కేవలం, – అప్రస్తుత ప్రశంస:

రాకరాక వచ్చినావు:

నీ కోరిక ఏవమ్మా...' అనంగా,

'రాయలవారీ మనవి, – తమకు విన్నవించమని నారు!– ముత్యాలశాల నిర్మాణము పరిపూర్తి అయినది: నూరు ప్రొద్దులాయె: ధూపదీపము లుంచినాము: ఆపై, – ఆదేశించవలసినది – తాము!–'

'ఏలినవారీ తీరున సెలవిచ్చినారుగా!–

మంచిది!–

ముత్యాలశాల నిర్మించ మన సైనదని వారన్నారు:

నేను కాదనలేదు;

ఎందుకని అడుగలేదు –

వారూ, – యిందులకని, వెల్లడి సేయలేదు;

యింతమట్టుకు – ఏలినవారికి గురుతున్నదనుకొందురు!

ఇక, –

చెప్పవలసినది, వారు – చిత్తమనవలసినది –

మేము:–?

'రాయలవారి అభిప్రాయమదికాదు:'

'కాదని నీవన్న కాదననమ్మా.

కాని, – తా మన్నదానికి, – ఔననిపించు కోవడం పరిపాలకులకు, – పరిపాటి! – వారి ఊహ ఏమో?–'

'తనకు మాన్యులై, తన కుమార్తెకు గురువులైన వేదమూర్తులకు కనకాభిషేకము చేసి, –'

... చేసి, – తామూ తమ పెద్దలూ, తరించేమన్నారు!– ఔనా? – వారికేమమ్మా! అనగలరు? – అందులకీ సౌభాగ్యవతి ఏమన్నదో? –'

'మా గురువు లంగీకరించ రేమో అన్నది –'

'కారణమేమో?'

'తా మనుకొన్నదే!... కానోపు నని భావించడమూ అవినయమే నని,–'

'ఎవరన్నారు?'

'నాకే తెలియవచ్చింది–'

'అది, – తెలిసీ తెలియని తనమని నే నన్న?–'

'ధన్యనే!'

'కావు!– నీది, అవినయంకాదు – అవివేకం!–'

మనసీయలేనివారు, – ఎదుటి మనస్సు గ్రహించలేరమ్మా–!'

'కాదనను – నేను చదువనేర్చినానే కాని, చదువులు నేర్వలేదు:

అవినయం, – మాయింటలేదు – అవివేకం నావంటలేదు – ఉన్నదొక్క – వల్లమాలిన రాజసం –

అనగా, –

నేను, – ముమ్మయ్యగారికి కూరిమి శిష్యురాలననే – అహంకారం! అది, – తమ చలువను నాకు శాశ్వతం కావలె! ...

– మా గురువు సర్వజ్ఞమూర్తి – మహారాజా!

వారి సన్నిధిలో మోకరిలి, – రవంత విద్య, ఒక్కింత వినయమూ, – వారికి కలిగిన దానిలో, – ప్రసాదించమని, దేహీ అన్నది మనము:

యాచకులు దాతలవలె లీవులు పోవడం, – అవివేకం కాదా – దైవానికి దక్షిణ లిచ్చేమా? –

అని, నాకు తోచిన తీరున మనవి చేసినా –

వారు మన్నించినారు:

యిది, అసంగతమని నే ననుకొనను –

మరి, – అముత్యాలశాల ఎలా సద్వినియోగ మయేనో? – శారదామూర్తిని నెలకొల్పిన సమంజసమని, – నా అభిప్రాయము: తామామోదించేరని, – నమ్మకము:

కాశ్మీరమునుండి, – శిల్పులు ఆ దేవీమూర్తిని కొనివచ్చినారు: అందులకు సుముహూర్తము, – నిర్ణయించవలె–' అంటూ చిక్కవిరుపాజి, విన్నవించుకుంటూండగా, – దొడ్డరాయలు అక్కడికి విచ్చేసి, – అంజలించి, –

'సుముహూర్తము నిర్ణయించవలె! – ఆ శుభకార్యము, – తమ చేతి మీదుగా, – జరగవలె, –' అనినాడట!

'యిది, – సీమలో వారి మనవి –' అనినదట రాకుమారి,

'నే నర్హుడను కానమ్మా' అన్నారట ముమ్మయ్యగారు:

'మీకుగాక – అర్హత ఎవరికున్నది–?'

'కృష్ణా–సానికి! రాయలవారు చకితులు కానక్కరలేదు. యిందులో నిష్ఠురములేదు! ఔనమ్మా – నేను శారదాదేవి సేవకుడను –

ఆమె – చెలిమికత్తె –

అంతరం గమనించినావా –

మనము సాధనలోనే ఉన్నాము:

ఆమె సాధించినది, – సద్వినియోగము చేసినది:

మనది, – ఆరాధన!–

ఆమెది, ఆదరణ!–

అర్హత ఎవరిదమ్మా!–

రాయలవారు, – యీ విషయం శ్రుతపరచి మహోత్సవము సానుకూలము చేయించవలెనని, – నా కోరిక! – ప్రజలందరితోపాటు నేనూ, – శారదామూర్తిని సేవించు కునేందుకు, రాకమానను!–' అనంగా, – రాయలు ఆనందించినాడట...

'యింకొక్క మనవి –' అన్నదట రాకుమారి!

చిరునవ్వుతో, – ప్రసన్నులై, – మాకు సెలవౌసంగరా, – అన్నదట –

'ప్రసన్నతకు, – పారితోషికము –?'

'నేనే –'

'అదే కావలసినది – అమ్మా' నీకు తెలుసు కద, – ద్రాక్షకు, కదళికి దోహదక్రియ, గానమని; నీవూ నీ నెచ్చెలులూ, – నిత్యనివాసంగా వనం ఫలించేట్టు చేయరమ్మా! – అని నారట!

ముత్యాలశాలలో, – శారదామూర్తి నెలకొన్నది: రాకుమారి, – కదళీవనములో నిలచిపోయినది:

ఈ వైనము తెలియంగనే, శ్రీనాధునికి కాలు నిలువలేదు – కదలివచ్చినాడు:

వెన్నెల మరింత, – రవంత ముదిరినది –

వసంత మంటపంలో, – కృష్ణాసాని, – రాధామాధవులకు, వేడుకగా, నాట్యమారంభించినది: తాను, తమిదీరని పరకీయ – వాడో తడవుసేయు నెరజాణ–

రేపల్లె వాడలో వేడుకా! – వేడుకైన కన్నె వేదనా!
వేదన తీరగ వెన్నెలతీరుగ – రారా గాన లోలా!–
రారా!– రాధాలవాలా!
యమునా తీర సైకతాల ఎంతో చల్లని హాయిరా,
యదురాయా! నీనగవూ, మచ్చుచల్లే మాయరా॥
సరసాల సారము నీ వొల్లీ వొల్లని చూపురా,
కమలనయన! నీ మురళీ గమకమ్ములు నేనేరా॥
కన్నుల జూచి మన్నన సేయగ కాచి యున్నారా,
పున్నమిలాగ, నీవురాగ పొందిపోదురా॥
తాను లోల–వాడులోక కుటుంబి!
రాజీవ లోచన! మురళీ మోహన!
గోపీచకోరీ సుధా కిరణ!
రాస విలాస నారీమయూరీ

లాలస లాస్య వినోద మనా॥
చిననాడు నినుజూచి మనసైనవారు,
చనువై దరిజేరు సరసాలవారు,
నిను దైవమని ఎంచి కొనియాడువారూ,
ఏ వాడ నైనాను ఎవరైన నీవారె॥
వావీ వరుస మాకు నీవే, –
మా పరువైన ప్రభువైన నీవే,
నీ సిగలో సుమదామ మయేయోగ
మేనాటికైనాను, – మాదే గోపాల॥
తాను తనకే దూతిక–వాడు వగలు నేర్చిన తేరకాడు:
వానితో వాదమేలనే, నల్ల, వానితో వివాదమేలనే
రాకరాక విచ్చేసెనె రాజసాలు మనవే
ఏ కోమలి సేయనిమారా మేలనే – మారునిగన్న – ॥వానితో॥
సిరిగల చెలువుడు కాదా, – చిత్తము రా నడువడా,
సరసము నేరనివాడా – చాలని వాడా.
నెరజాణ! రా, రా, రమ్మని, నిన్నే నమ్మితి ననీ, నీకే దక్కితిననీ
మరియాదగ మన్నన సేయక, మానినీ! గోకులమేలు – వానితో॥
కులము సామి కోరిన ఏ కులపాలిక యైనగాని
కలికితనము తానై వానికి గాన్క సేయదా?
లీలగా రేపల్లెవాడ ఏలే మగరాయడే!
బాలవా, ప్రోడవు కాన, భళిరే! అల్లపిల్లన గ్రోవి–వానితో॥
తాను, – బాల, వాడు లోలుడు:
యమునాతీర కుంజ విహార!
యదువీరా! భువనైక సుందరా॥
కరివరగమనా! కమల నయనా!
రమాకమన! రాకేందు వదనా॥
వాలారు జవరాలి నీలాల చూపులే
నీ చిరునవ్వుల లాలనలూ,
నిన్నేకొలిచి కలలేలు బాలకు
నీ లీలలే పూల మాలలూ॥
పాలదేలు గొల్లవారి వ్రేపల్లె వాడలో
రేకరేక తావి జిమ్ము లేమావి నీడలో
కన్నెగోము కొల్లలాడి కవ్వించి మాయజేసి
ఆసదీర ఆదరించు మానరా! మనోహరా॥
తాను ముగ్ధ – వాడు నెరజాణ!
నిన్నన పని లేదురా
చిన్నతనపు పనులు నీకు వెన్నతో నేర్చినవె కాని॥
పున్నమి వెన్నెలకు తాళక
పొన్నమాని నీడను నిలువ

నన్నుజూచి కనుగీటిన
నాగర! నవనీతచోర॥
పదార్వేల కన్నెలకు - పదాల్నేర్పు కథల్వినీ
అదే తావున అల్లందుకే - నవమదనా! నడయాడినార॥
డాసీ - నెవరు లొలుకు లలనను - జూసీ
గడుసు తనపు పినులే - జేసీ
బెదరవు!
నీ సొగసు రసభరితము - నీనగవు అతి మధురము
సరాధారా! శ్రీధవా
పదింబదిగ అదేపనిగ సుధాధరల జెనకుదురా?
విలాసమో, వినోదమో - విరాగమో, విహారమో'
నీ మోమందమ్ము నీదౌ చందమ్ము మా కానందమ్ము -
యింద్రాద్యమర బృందార్చిత పదాంభోజయుగ!
అనుదినము నినుగొలుచు ఫలమిదిర!-

కృష్ణాసాని, - యీా తీరున సేవించుకున్నదై, - ఆసన్నిధిని నిలువంగా, - నూరుగురు కన్నెలు' రాధామాధవులు కారతు లెత్తంగా, - సేవలకు వచ్చినవారు ఆరతి కనుల కద్దుకొని తరలిపోగా, - తా నొక్క_డే మిగిలినాడు!-

కృష్ణాసాని, - కలయజూచి ఆ తేజస్విని సమీపించినది:

'అయ్యా! తాము ప్రసాదము స్వీకరించలేదా?'

శ్రీనాధుడు అప్పటికి మేలుకొనినాడు;

'తాము మా సీమవారు కారేమో!'

'కానేమో -'

'నామధేయమేమో!'

'సిరిగలవాడను కాకపోయినా, - శ్రీనాధుడనే!'

'శ్రీనాధులా! - తెలుగు కవితకు పరువు దెచ్చిన శ్రీ నాధులా!'

శ్రీనాధుడు పలుకలేదు -

'అమాత్య కమలనాభుల మనుమలౌదురా!-
మారన్నగారి కుమారులేనా -
ముమ్మయ్యగారికి చిననాటి నెచ్చెలి మీ నాయనగారు -
వారు సెలవీయగ విన్నాము:
మీ దర్శన భాగ్యము - అభిలషించినాము - నేటికి ధన్యుల మైనాము!'

'ధన్యుడను నేనమ్మా!'

కృష్ణాసాని, - శ్రీనాధునికి కైదండ యిచ్చి, - ఆసీనుని జేసి పదములంటి మ్రొక్కి_, - దీవన అందుకున్నది.

'తా మిచ్చటనే నిలువ వల్లెనని - మనవి'
ముమ్మయ్యగారి సన్నిధిలో ఉండే నమ్మా!'

'తమ దర్శన భాగ్యము? -'

'అనుదినమూ సేవలకు రానా!-'

'అంతటితో తనివి దీరేనా -'

'బ్రాహ్మణులు అల్పసంతోషులు'

'నేను బ్రాహ్మణిని కాను -'

'నేను కమనుడను కాను -'

కృష్ణాసాని కనుకెంపుజేసినది-

'కవిరాయలు పొరపడినారు!'

'రాయలూ పొరపడ లేదు - కవి రాయలూ పొరపడ లేదు - కృష్ణాసానీ, - రాయల కామన, - నీ కీ సీమ నిత్యనివాసము చేసినది: కాని నీవు రాజభోగము లాసించి యిచ్చట చేరలేదు: నీవు లాలసవు కావు, రాధామాధవులకు సేవికవు: యీసీమ నేలేది రాయలు కాదు: నీ గానము:'

అది, - కన్నడ ప్రజలకు పరమై శాశ్వతమై విలసిల్లేను:

నీవు బ్రాహ్మణివి కావు: నా కవితా కన్యవు:

నేను కమనుడనుకాను: జనకుడను!- పొరబడినానా!-

కృష్ణాసాని, - శ్రీనాథుని కౌగలించుకున్నది:- 'శ్రీ గురవే నమః' అని మననము జేసినది:....

ముమ్మయ్యగారి కదళీవనంలో -

వెన్నెల మారాకు వేసినది:

శ్రీనాథుడు చేరుకున్నాడు: ముమ్మయ్యగారు ఎదురైనారు:

'ఏం మామా!'

'ఎవరీ అల్లుడు-'

'మారన్న కొడుకు-'

'అనగా, - ఆ కవితలల్లే, గడుగ్గాయా -'

'అ, - వాడే!'

ముమ్మయ్యగారి నవ్వువెల్లువ వనాన్ని ముంచెత్తింది:

యిద్దరూ ద్రాక్షపందిరి నీడను ఆసీనులైనారు:

'మా మారన్న వెనుకటి త్రోవలోనే ఉన్నాడా? - ఓ పట్టున స్థిరపడినాడా? -'

'ఆహా!-'

'ఎక్కడ'

వారణాసిలో!

తిరిగిరాడా!-

అవకాశం లేదేమో!- మా తాతగారి కీర్తి ప్రఖ్యాతి మాతండ్రిని దేశమునుంచి తరిమికొట్టినది -

అనగా -

మా తాత విష్ణు - చిత్తుడు, మారన్న గారు శైవులు. అది తమకు తెలిసే ఉండవచ్చు! దానివలన రగడ రాలేదు: తాను కవి: కొడుకు ఆ తీరున పేరు తెచ్చుకోడేమని అయన కించ! మా తండ్రికి అది నచ్చలేదు: అనగా కవిత అన్న వైముఖ్యము కాదు - సుమండి! కాళిదాసాదుల రచనలు చదివి ఆనందించుటకే

యీజన్మ చాలదే - నీవూ నేనూ కవన మల్లుట ఎందుకయ్యా - అని మృదువుగానే చెప్పినాడట, పద్మ పురాణ కథను తెలుగున పాకంబట్టిన తాతగారు అది తన కీసడింపు అనుకోడం సహజం:

తానేమో ప్రయోజకుడు: అమాత్యశిఖామణి: పైపెచ్చు కవి. కొడుకో - ఏదీ కాదు: పండితుడే కాని రాజ సభ కెక్కడే - తనంత తెలివితేట లున్నవాడే: పోనీ కొలువుకున్నా కుదరడే!- అదీకాదిదీ కాదు అన్నా, - ఒక్క కావ్యమన్నా రచనచేసి, - తానూ ఒక మనిషి ననిపించుకొనడే - యిదీ, - అయనదుగ్ధ! ఆపేక్ష అంతఃకరణలు లేకకాదు - కాని, - యిద్దరిదీ ఒక్కటే తరహా!- ఒకరిమాట ఒకరు వినలేదు:

వయసు వచ్చినకొద్దీ సహనం సన్నగిలడం సహజంకదా! - 'ఒరే నాయనా - నీకుచెప్పి ఒప్పించలేను. కాని వాడినైనా బాగుపడనీయరా. రాజులకొలువు చేయమనను. నామం దిద్దమనను: వాడన్నా రవంత కవన మల్లేందుకు అనుమతించరా! నీ మనుమడెవరయ్యా అంటే మహాకవి శ్రీనాథుడని, - అని సంబరపడాలని ముచ్చటరా: ఒక్కటే - యిదొక్కటే కోర్కె - చెల్లించరా!' అని తాతగారు బ్రతిమాలుకున్నారు: ఆ తరుణంలో నేనూ ఉన్నాను:

మా తండ్రి నావంక జూచినాడు:

నేను తల, ఊపినాను:

'తాతయ్యా! - నీ బిడ్డ నీమాట కాదనడు,'

నేను కవన మల్లుతాను: రాజసభా మర్యాదలందుతాను: నీకు అలవికాని వైభవాన తులదూగుతాను: సరేనా: యిందుకు యీ జన్మలో వెనుకంజలేదు:

కాని, - నాదొక్కటే కోరిక, నీవు కాదనరాదు:

తాతగారూ! ఒక్కయింట యిద్దరు కవులెందుకు? - మీ గ్రంథం - గంగా ప్రవాహంలో కలిపివేయండి: వెంటనే నేను గంటం పడతాను: మీవంటి వారికి కవి అనే గౌరవమే చాలదా, అందుకు గ్రంథమొక్కటి కావలెనా, అదిన్నీగాక, - నాచేతనైన మట్టుకు మీగ్రంథ నామాన్ని మీ ఘనతనూ ప్రచారము చేయక మానను లెండి!'

యిలా అన్నాను: ఆ మాటమీదే ఉన్నాను:

మా తండ్రి నన్ను మెచ్చలేదు - దీవించలేదు:

'నీ బాధ్యత తాతగారిది: నీ భవిష్యత్తు నీది!-'

నీ కోసరమని యింతకాలం నిలువక తప్పిందికాదు.

యిక నిశ్చింతగా కాశీకి పోవచ్చు-

అని, - నాతో అని, -

'మనుమణ్ణి చూసి, - బులలాటపడి, - మరో కావ్యం రచించేవు సుమీ: వాడూరుకోడు!-'

నాన్నా - ఒకరికొకరం దూరం కావడం లేదు:

యీనాటికి - చేరువైనాము:

విశ్వనాథుని సన్నిధిలో - మూడువేళలా నిన్ను చూసుకుంటాను - అని మాతాత గారిని బుజ్జగించి - మాతండ్రి మాకు తనను దూరంచేసికొన్నాడు:

యిదీ మాకథ – మామా!–

దేశాటనం చేశాను: దివ్య తీర్థములు క్షేత్రములూ సేవించుకున్నాను. అంతో యింతో కవనమల్లాను: తాతగారిని కలకల లాడించాను: తమ దర్శనానికి వచ్చాను–'

'ఔనోయి, – వచ్చినది, – మా దర్శనమునకే కాని, – దారిలో అడుగు తడబడినదేమో –'

తడబడినదో – తనివి తీరినదో –

మామా! – నీవు అఖండుడివి! –

శ్రీనాధునికి కదళీవనంలో నిద్రపట్టినది –

– కోటలో రాయలకు నిద్రపట్టలేదు –

కృష్ణాసాని, విజయంచేయమని వర్తమాన మంపలేదు –

చూచాయగా తెలియవచ్చిన కారణం–నిలువనీయలేదు: దేవరవారే తరలిపోయినారు–

కృష్ణాసాని నిదురలో ఉన్నది:

చెలులు తత్తరపడినారు:

'ఏమిటీ నిదుర?' అని, గర్జించినాడు రాయలు:

'అందరికీ, వచ్చేనిదురే. అది యీనాడు మీకూలేదు – నాకూ లేదు –' అన్నది, కృష్ణాసాని.

'కారణమేదో – విన్నాము –'

'విన్నారని – విన్నాను, వచ్చినవారు మహానుభావులు'

'కనుకనే వలసినతీరున ఆదరించినావు!'

ఆదరణ వారిది – నేనారాధించినాను.

'ఫలం?'

'జన్మ సాఫల్యమే! – రాయలవారూ! మీ కోటలో మాకూ, – మాతోటలో మీకూ, గూఢచారులున్నారు: నేను వారిని కౌగలించుకున్నానని తాము తెలుసుకున్నారు – కనలినారు:

కాని, – అది రాధామాధవుల దివ్యసన్నిధే!

అప్పుడే సేవ ముగిసినదే –

అంతలో యీ అకృత్యమా? – అని మీరు యోచించలేదు:

నేను పుణ్యవతిని కానేమో కాని పుంశ్చలినికాను!

నీతి మాలితినేమో కాని, నియమము తప్పలేదు –

ఆక్షణంలో నేను – కవితా కన్యను: ఆమహాకవి నాజనకుడు: ఆపరిష్వంగములో భావము తమకు గోచరమైనదా:–

తమకు ఆహ్వాన మంపలేదేమనేరా?–

కవిరాయల జూసినకంట రాయలజూడ, యీరేయి మనసురాలేదు: అంతే, నమ్మలేననేరా, – నమ్మనక్కరలేదు – నా వెనుకటి పాట ఉండనే ఉన్నది –'

రాయలు తేజీ దిగినాడు: కృష్ణాసానిని అనునయించినాడు: ఆ కవిరాయలను, – సన్నిధికి రప్పించమన్నాడు. కృష్ణాసాని నవ్వినది;

'ఉన్నది – ముమ్మయ్యగారి సన్నిధిలో –

వచ్చేరని, – వారు రానిచ్చేరని – మనకు నమ్మకము లేదు: అయినా, – తాము, కదళీవనానికి విచ్చేసి, – మనవిచేస్తే, – ఏమనేరో, –

రారో, – పోనీ యీ రూపేణా గురువులను దర్శించి నట్టవుతుంది –'

'యోచిస్తాము!'

కృష్ణాసాని మరియొక పరి నవ్వినది – రాయలు సరసపు చూపు చూసినాడు: ఆమె పరుషముగా పలికినది –

'రాయలవారు మైమరచినట్లున్నారు, – ఔచిత్యము మరచినట్లున్నారు:

రాధామాధవుల సేవ ముగిసిన ఒక్క క్షణాన, – తామిక్కడికి విజయం చేయడం – అరజాము వేడుక పడటం అంతఃపురానికి దయచేయడం, – మన మేర్పరచుకున్న మర్యాద:

యీనాడు, – తాము ద్వివిధాపచారములు చేసినారు:

యీ సేవకిని శంకించినారు. ఒక్క మహాకవిని, – పరమమహేశ్వరుని, – సామాన్యజారుని చేసినారు:

దానికేమిగాని, – పూజ్యురాలు కృష్ణాంబికకు యీనాడు, – విరహక్లేశము కలిగించినారు:

మీరు సాపరాధులు:

నేడు పున్నమి; మరల పున్నమివరకూ – తామీ చాయలకు దయచేయడం భావ్యంకాదు – యిది మీకు దండన: యింగిత మెరుగని మీవంటివారి ఆలనలో నిలచినందుల కిదినాకు దండన, తర్కించవద్దు:– అంతఃపురానికి దయచేయండి: అని చిరునవ్వుతో సాగనంపినది.

కదళీవనములో తెలవారినది

అనుష్ఠానము తీరినది:

కన్నెలగానము కలయగ్రమ్ముకున్నది –

ఒక్క ఝూము ప్రొద్దెక్కినది.

అట్టహాసముతో, – ఆడంబరముతో, – రాజనాధుడు వచ్చినాడు: 'మామా సేమమేనా! అని ముమ్మయ్యగారిని పలుకరించినాడు; వానివైఖరి పరకాయించి – 'ఎవరీ తమ్ముడు' అన్నాడు శ్రీనాధుడు –

'రాయలు మెచ్చిన కైత లల్లిన రాజనాధుడు:'

ఓహో – కంచుఢక్కా కవా? – రాయల వారి కీర్తి మార్మోగించే ఘనుడితడేనా? – రా తమ్ముడూ, – నేను –'

'నీవేలే! – మా అన్నవేలే! – కృష్ణాసాని తెలిపిందిలే యిదిగో అన్నా! – మార్మోగేది. రాయల కీర్తికాదు. అపకీర్తి–!

ఒకనాడు రాయలవారు, – ఏకళనో ఉండి, నే నెదుటపడగానే, – 'రాజనాధమహాకవీ' అన్నారు: యిదేమా – అనుకున్నాను. నేనప్పటికి కవన మల్లలేదు. త్రితలా వచ్ఛేదకతా నిరూపణతో సాముచేస్తున్నాను;

వా రేమన్నా చిత్తమనక తప్పదుగా –

కావ్యమల్లేవా అన్నారు; అదెంతభాగ్యమన్నాను:

మాకు వినోదహేతువు కావాలి – అన్నారు:

మీకు వినోదం లోకానికి విద్యాద్వారం కల్పించేను –'

అన్నాను: ముగుదల అయినది – కసిగా ముప్పొద్దులలో కావ్యము పూర్తి అయినది – విశేషార్థ వివరణతో, – వినిపించినాను: మెచ్చినారు. ఆ మెప్పుకు గురుతుగా, – నేను మహాకవినని వాడవాడల చాటుకునేందుకు అనువుగా కంచుఢక్కా దయచేసినారు: మ్రోగి మ్రోగి బీటలు వా రేస్థితికి వచ్చినది – నేడో రేపో విచ్చుకుంటుంది: ఆ రవంత నీచేతిమీదుగా పూర్తి అయితే నాకు పరమానందమన్నా – తమ్ముడూ, – ఎన్నటికీ యీపాడుపని చేయవుకద – చేయవు కద – అని నన్ను గద్దించే సత్తువతో, ఢంకామీద కొట్టు – అది మూగవోతుంది – అదే నాకు దీవనౌతుంది –

శ్రీనాథుడు రాజనాథుని కోరిక మన్నించినాడు:

కొంత తడవుకు రాయలు దయచేసినాడు –

గురువులకు ముభావంగా నమస్కరించి – శ్రీనాథుని వంక జూసి, –

'తామేనా తెలుగునాటి మహాకవులు –

మా కొలువుకు దయచేయండి –'

'తామేనా, – కన్నడరాజ్య రమారమణులు దొడ్డ దేవరాయలు – దయచేయండి!–

ఆ కాకువు అర్థము చేసికొని, – రాయలు, – ముమ్మయ్యగారి సన్నిధి కనుక – బదులు పలుకలేక నిష్క్రమించినాడు:

వరదూసిన కై జార్రై, చిక్కవిరూపాజి శ్రీనాథుని ఎదుటికి వచ్చినది –

యీ చిరంజీవి – రాకుమారి చిక్క విరుపాజి, – అన్నారు ముమ్మయ్యగారు –

'విన్నానమ్మా':–

'మేమూ విన్నామయ్యా:– రాయలవారిని అవమానించేందుకా, – తాము మాసీమకు దయచేసినది? –'

అభిమానించే వచ్చానమ్మా –

అమ్మా – నేను యీ సీమకు వచ్చినది. రాయలవారి దర్శనానికి

కాదు – వీరిని దర్శించేందుకు!–

కృష్ణాసాని గాన మాలకించేందుకు –

నిన్ను – చెల్లెలా అని చేరదీసేందుకు –

పరమ సాధ్వి కృష్ణాంబికకు, – మీ సీమలో నిలిచి చేయెత్తి మ్రొక్కేందుకు.,

రా అమ్మా! – అన్న సరసను కూర్చో–

అమ్మా – రుక్మిణిని కృష్ణుడు, – సుభద్రను అర్జునుడూ, బలవంతానో, అనునయానో హరించారు:

ఆకసంలో విహరించే ఎందరో గంధర్వ కుమారులు, విరిశయ్యల అసురసురనే కోమలాంగులను, – వరించినారు:

ఆ కలికి కన్నె కనులలో నిలిచినవేమో!–

అమ్మా, - తండ్రి ఎదుట సిగ్గుపడిన దేమోకాని, - సుభద్ర అన్న ఎదుట బిడియపడలేదు - మనసు దాచలేదు -

నేను నీ అన్న నమ్మ - నాతో చెప్పరాదా అమ్మా -

చిరంజీవి - గడుసుదనం - తలబిరుసుదనం - మా తెలుగు వారి సొత్తు. నీవు యీ సీమలో తప్ప బుట్టావు! - దానికేమి గాని, - నీవు మా తెలుగుల కోడలివి కావాలి:

కర్ణాటక సంగీతం మా తెలుగు వారికి అత్తింటి - అరణం కావాలి!- ఏమందువమ్మా!-? అనినాడు:

చిక్క విరుపాజి, - అంతలో సిగ్గుపడి, - అంతలో ప్రసన్నురాలై - 'అన్నా!' అన్నది -

'మామా - నేను వచ్చిన కార్యము సానుకూలమైనది - యిక నాదారి నాది-' అన్నాడు శ్రీనాధుడు -

ముమ్మయ్య, పకపక నవ్వుతూ, -

'చుట్టపు చూపుగా వచ్చి దోచుకుపోతున్నావు గదరా!-' అనినాడు:

'మామా, - లాభంలేని లౌక్యం జేస్తానా? - నేను కమల నాభుడి మనమణ్ణి కానా!' అన్నాడు.

చిక్క విరుపాజి, కదళీ ద్రాక్షఫలములు అన్నకు కాన్క జేసింది.

*[ఫిబ్రవరి 1963, జ్యోతి]*

★ ★ ★